క్లుప్తంగా

పారిశుద్ధ్యం నిర్వహణపై శిక్షణ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని కమిషనర్ ఎస్కే నజీర్ తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ తాడిగడప మున్సిపాలిటీతో పాటు పలు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో శిక్షణ కార్యక్రమం నిర్వహించిందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రులకు పనిలో సామర్థ్యం పెంపుపై ఆల్‌ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ డైరెక్టర్ చలపతిరాజ్ శిక్షణ ఇచ్చారన్నారు. రిసోర్స్ పర్సన్లు డి.ఫణికుమార్, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారని చెప్పారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి



పెనమలూరు: రైతులు వరి పంటను కాపాడుకోవటానికి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ చెప్పారు. పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో మంగళవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో శైలజ మాట్లాడుతూ.. వరి పొట్ట దశలో ఉన్న సమయంలో ఎలుకల నివారణకు రైతులు సామూహికంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వరి పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రావాలంటే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినతి



గన్నవరం: విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాల నియంత్రణకు పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిల్లరా రాజేష్ కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. గన్నవరం ప్రాంతంలో యువత, విద్యార్థులు గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని కోరారు. సంఘం మండల కార్యదర్శి వేములపల్లి గేయ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

అరటి, పసుపు పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి



పెనమలూరు: అరటి, పసుపు పంటలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి సూచించారు. తాడిగడప గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి అరటి, పసుపు పంటలను పరిశీలించారు. అరటి పంటలో ఎక్కువగా సిగాటోగా వ్యాధి కనబడుతుందన్నారు. అలాగే పసుపు పంటలో ఆకుమచ్చ తెగులు నివారణకు తగిన సూచనలు చేశారు. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట దిగుబడులు సాధించాలన్నారు. ఉద్యానవన అధికారి హరిచంద్, రైతులు పాల్గొన్నారు.

పీ-4 కుటుంబ అవసరాలపై సర్వే చేయండి



విజయవాడరూరల్: పీ – 4 కుటుంబ అవసరాలపై సర్వే చేయాలని రామరాజ్యనగర్ పంచాయతీ కార్యదర్శి విజయ్‌శ్రీనివాస్ సచివాలయ సిబ్బందికి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి సర్వే చేసే అంశంపై రెండు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. ఆర్థిక అవసరాలు, వ్యాపారం, ఆస్పత్రి అవసరాలు, స్కూల్ ఫీజులు చెల్లింపు, రుణసదుపాయం బంగారు కుటుంబాల్లో సభ్యులు అడుగుతున్నారో వాటిని మార్గదర్శకులకు తెలియచేసి వారి ద్వారా అవసరాలను తీర్చేవిధంగా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు వారి పరిధిలో 12 నుంచి 15 కుటుంబాలకు వెళ్లి తప్పనిసరిగా సర్వే చేయాలన్నారు. రెండు రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని తెలిపారు. నియోజకవర్గ యంగ్ ప్రొఫెషనర్ రవిబాబు సర్వే వివరాలను తెలియజేశారు.

సర్వీసు రోడ్లు.. సమస్యల నెలవులు

- అధ్వానంగా సర్వీసు రోడ్లు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు

కంకిపాడు: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్లు సమస్యలకు నెలవులుగా మారాయి. సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా, అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణం సాఫీగా సాగక ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రజల ఇక్కట్లను అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి ప్రయాణికుల సౌకర్యార్థం కంకిపాడు పరిసరాల్లో సర్వీసు రోడ్లు ఏర్పాటుచేశారు. బైపాస్ మార్గం నుంచి ప్రధాన గ్రామంలోకి వెళ్లేందుకు, సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఈ సర్వీసు రోడ్లు ఉపయోగపడుతున్నాయి.

అధ్వానం.. అస్తవ్యస్తం..

ప్రస్తుతం ఈ సర్వీసు రోడ్లు అధ్వానంగా మారాయి. కంకిపాడు అండర్ పాస్ వద్ద ఉత్తరం వైపున ఉన్న సర్వీసు రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతుల కారణంగా వాహనదారులు జారిపడి గాయపడుతున్నారు. దీనికి తోడు సెప్టిక్ ట్యాంకు వాహనాలు వ్యర్థాలను ఈ సర్వీసు రోడ్డులోనే డంప్ చేస్తుండటంతో ఇక్కడి పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. దక్షిణం వైపున ఉన్న సర్వీసు రోడ్డు పూర్తిగా జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలకు డంపింగ్ కేంద్రంగా తయారైంది. దీంతో ఈ మార్గంలోకి ప్రయాణించటం అంటేనే వాహనదారులు జంకుతున్నారు. స్థానిక సంస్థల అధికారులు సైతం రోడ్డు మార్జిన్‌లను అధ్వానంగా మారుస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రోడ్డు మార్జిన్‌లు అపరిశుభ్రతతో అధ్వానంగా మారుతున్నాయి. ముక్కుపుటాలు అదిరే దుర్గంధంతో ఇక్కట్లు పడుతున్నారు.



గుంతలమయంగా మారిన సర్వీసు రోడ్డు



సర్వీసు రోడ్డులో ఏర్పడిన పెద్ద గొయ్యి

భయం భయంగా రాకపోకలు..

పునాదిపాడు అండర్ పాస్ నుంచి కంకిపాడు చెత్త డొంక వరకూ ఉన్న సర్వీసు రోడ్డులో ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డు మార్జిన్‌లో ఓ చోట పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షం నీరు ప్రవహించి అగాధం ఏర్పడింది. మరో వైపు రోడ్డు మార్జిన్‌లోనే వ్యర్థాల గుట్టలను పారబోస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోతున్న గుట్టలు రాత్రివేళల్లో కనిపించే ఆస్కారం లేకుండా పోవటంతో వాహనదారులు బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..


సర్వీసు రోడ్ల కారణంగా ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నా అటు జాతీయ రహదారుల శాఖ, ఇటు స్థానిక సంస్థలు పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, సమన్వయం లోపం కారణంగా కొందరు వ్యర్థాలను యథేచ్ఛగా రోడ్లపై పారబోస్తూ అస్తవ్యస్తంగా మారుస్తున్నారు. ఇప్పటికే రోడ్డు మార్జిన్‌లను డంపింగ్ కేంద్రాలుగా మారుస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్వయంగా కలెక్టర్ బాలాజీ ఆదేశాలిచ్చారు. అధికారుల్లో స్పందన వస్తుందో.. లేదో చూడాలి.

ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా జాస్తి రామారావు

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా జాస్తి రామారావు నియమితులయ్యారు. గుంటూరు నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రామారావును ఉద్యోగోన్నతిపై ఉయ్యూరు మున్సిపాలిటికి బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు వచ్చే నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డి.యదునందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నవోదయలో 9వ తరగతి ప్రవేశానికి, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు ముందుగా ప్రకటించిన తుది గడువు ఈ నెల 23వ తేదీతో ముగియటంతో నవోదయ విద్యాలయ సమితి తాజాగా వచ్చే నెల 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉప్పలూరులో పూజలందుకుంటున్న అమ్మవారు



కంకిపాడులో శివాలయంలో గాయత్రీదేవిగా అలంకరణ



గాయత్రీ దేవి అలంకరణలో పేరంటాలమ్మ



గన్నవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంతానలక్ష్మి



ఉయ్యూరు విజయదుర్గాదేవి ఆలయంలో..




యనమలకుదురులో బ్రహ్మచారిణిదేవిగా పార్వతీదేవి

గాయత్రీదేవి పాహిమాం..

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా శ్రీ దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం అమ్మ వార్లు శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. – పెనమలూరు/ఉయ్యూరు/కంకిపాడు/గన్నవరం/నున్న(విజయవాడరూరల్)/హనుమాన్‌జంక్షన్



కంకిపాడులో గజలక్ష్మీ దేవిగా వాసవీమాత



కనకదుర్గ ఆలయంలో గాయత్రీదేవి అలంకరణ



నున్న కనకదుర్గ దేవస్థానంలో..



ప్రొద్దుటూరులో గాయత్రీదేవిగా అన్నపూర్ణాదేవి

పోషకాహారంతో పిల్లల్లో ఆరోగ్యవంతమైన ఎదుగుదల

ఆత్కూరు(గన్నవరం): పోషకాహారంతో పిల్లల్లో ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.మంగమ్మ తెలిపారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు–4 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ఆకుకూరలు, పండ్లు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసే ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు, పిల్లలు క్రమం తప్పకుండా తినాలని చెప్పారు. సెక్టార్ సూపర్‌వైజర్ బి.పద్మావతి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెనమలూరు: చిన్నారులను ఆరోగ్యంగా పెంచితే ఎదుగుదల బాగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. కానూరులో 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025లో భాగంగా మంగళవారం పలు అంశాలపై తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం ఇచ్చి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. చక్కెర, నూనె పదార్థాలు ఇవ్వకుండా మంచి ఆహారం ఇవ్వాలని తెలిపారు. బాల్యదశలో చిన్నారులను తల్లులు జాగ్రత్తగా పెంచాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వణుకూరులో జరిగిన కార్యక్రమంలో తల్లులకు వోకల్ ఫర్ లోకల్‌పై అవగాహన కల్పించారు. పోషకాహారం తయారీ చేసుకోవటం, స్థానిక ఉత్పత్తులు, రుచికరమైన వంటల తయారీ, బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బి.కామేశ్వరి, తల్లులు, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆత్కూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మంగమ్మ

పశుసంపదతో ఆర్థికాభివృద్ధి

ఉయ్యూరు: పశుసంపదతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేసి రైతులకు అవగాహన సదస్సు జరిపించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చిలకపాటి రాజీవ్‌తో కలిసి సీఈఓ శ్రీనివాస్ ప్రారంభించారు. లేగదూడల ప్రదర్శనలో 68 దూడలు పాల్గొన్నాయి. వీటిలో మాదల సుబ్రమణ్యేశ్వరరావు, వల్లభనేని భూషయ్య దూడలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. తాతినేని వెంకటరావు దూడలకు తృతీయ బహుమతి లభించింది. 55 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 75 పశువులకు బాహ్యపరాన్నజీవుల నిర్మూలనకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సీహెచ్ చిన నరసింహులు, డెప్యూటీ డైరెక్టర్ చంద్రమోహన్, ఏడీ రామశేఖర్, పశువైద్యాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

జలమయమైన కోడూరుపాడు రైల్వే అండర్ పాస్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులోని రైల్వే అండర్‌పాస్ పూర్తిగా జలమయమైంది. మూడురోజులుగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అండర్‌పాస్‌లో మోకాళ్ల లోతున నీళ్లు నిల్చిపోవటంతో నిత్యావసర వస్తువుల కొనుగోళ్లు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లాల్సిన వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలి నడకన వెళ్లే మహిళలు అండర్ పాస్ దాటేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైల్వే అండర్‌పాస్‌లో నిల్చిన వర్షపు నీళ్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులకు పలుమార్లు గ్రామస్తులు విజ్ఞప్తులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.



కోడూరుపాడు రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

విజయవాడరూరల్: గ్రామాల్లో వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రఘురామ్ చెప్పారు. మంగళవారం ఆయన పాతపాడు గ్రామం వచ్చిన సందర్భంగా పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 80 శాతం ఈ క్రాప్ పంట నమోదు జరిగిందని, మిగిలిన 20 శాతం మంది రైతులు కూడా సాగు చేస్తున్న పంటల వివరాలను గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో తెలియచేసి నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో రైతులకు అవసరమైన యూరియా ఎరువు అందుబాటులో ఉందని చెప్పారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలి

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ సూచించారు. కంకిపాడు బ్యాంకు కాలనీలో స్వస్థ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 255 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆరోగ్య సదస్సులో జేడీ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, సమన్వయంతో పనిచేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పోషకాలతో కూడిన ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, జిల్లా వైద్యాధికారి వెంకటరావు, డీఐఓ ప్రేమ్‌చంద్, సర్పంచ్ బాకీ రమణ, వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జేడీ డాక్టర్ సతీష్

● యథేచ్ఛగా పంచాయతీ స్థలం ఆక్రమణ



నిడమానూరులో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులు

నిడమానూరు జాతీయ రహదారికి సమీపంలో పంచాయతీ స్థలంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యథేచ్ఛగా ఆక్రమణకు దిగాడు. పక్కనే ఉన్న అతని స్థలంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కొంత మేర ఆక్రమించి వ్యాపార సముదాయ నిర్మాణం చేపట్టాడు. ఆక్రమణపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆక్రమణపై వివరణ కోరేందుకు పంచాయతీ కార్యదర్శి ఎన్.నరసింహరావును ఫోన్‌లో పలుమార్లు సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – రామవరప్పాడు

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని విశేష అర్చనలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు నల్లిబోయిన నాగరాజు, రజిని దంపతుల సహకారంతో 300 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బలవంతపు భూసేకరణపై నేటి ధర్నాను జయప్రదం చేయాలి

గన్నవరం: అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేస్తున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా విజయవాడలో బుధవారం జరగనున్న ధర్నాను రైతులు జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు సూరగాని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి పోలీసులను ఉపయోగించి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటుందన్నారు. బలవంతపు భూసేకరణపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపి, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకుల వైఖరికి నిరసనగా చేపట్టిన ధర్నాకు రైతులు భారీగా తరలిరావాలని కోరారు.

అనారోగ్య సమస్యలతో కానూరులో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు తులసీనగర్–1వ లైన్‌కు చెందిన వి.సుజాతజ్యోతి, భర్త నాగరాజు(45)కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. ఆమె పూల వ్యాపారం చేస్తుండగా నాగరాజు అరటి పండ్ల వ్యాపారం చేస్తాడు. అయితే నాగరాజుకు ఊపిరితిత్తుల వ్యాధి రావటంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో నాగరాజు సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. అతని వద్ద వాసన రావటంతో ఏమి జరిగిందని భార్య సుజాత జ్యోతి అడుగగా పురుగుల మందు సేవించినట్లు నాగరాజు తెలిపాడు. దీంతో అతడిని వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు నాగరాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై సుజాత జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ



డ్రాయింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో డ్రాయింగ్‌పై వారం రోజుల పాటు సర్టిఫికెట్ కోర్స్‌లో శిక్షణ నిర్వహించారు. ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టిస్ట్ ఇన్ మీ కన్సెప్ట్‌తో జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులు డ్రాయింగ్‌పై ప్రత్యేక శిక్షణ పొందారు. 60 మంది విద్యార్థినులు శిక్షణ పొందారు. చివరిరోజు మంగళవారం డ్రాయింగ్‌పై పోటీ నిర్వహించగా విద్యార్థినులు తమ ప్రతిభ చాటి వివిధ రకాల బొమ్మలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు విద్యార్థినులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి పి.ఆదిలక్ష్మి, శిక్షకులు షాహినా, హర్షిత, రమాదేవి, జడ్జిగా సీతామహాలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.